సాక్షి అనంతపురం

బుధవారం। 5। మార్చి। 2025




చీనీ టన్ను రూ.24,160

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.24,160 పలికాయి.



టమాట కిలో రూ.8

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.8 పలికింది. కనిష్టం 5, సరాసరి రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



న్యూస్‌రీల్

798 మంది విద్యార్థుల గైర్హాజరు



అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన ఇంగ్లిష్ పేపర్–1 పరీక్షకు జిల్లాలో 798 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 24,452 మందికి 23,789 మంది హాజరయ్యారు. 663 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 2,475 మందికి 2,340 మంది హాజరయ్యారు. 135 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్షల నిర్వహణ కమిటీ కన్వీనర్, బోర్డ్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి వెంకటరమణనాయక్ 3 పరీక్షా కేంద్రాలు, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు 5, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు 10, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు 14, కస్టోడియన్లు 13 కేంద్రాలను తనిఖీ చేశారు.

నాటుసారా నిర్మూలనే లక్ష్యం



కళాజాతా వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

అనంతపురం అర్బన్: నాటుసారా నిర్మూలనే లక్ష్యంగా 'నవోదయం 2.0' కార్యక్రమం అమలు చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'నవోదయం 2.0' కళాజాతా ప్రచార వాహనాన్ని మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా సేవనం వల్ల కలిగే దుష్ప్రభావాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, సీఐలు జయనాథ్, సత్యనారాయణ, ఎస్‌ఐలు జాకీర్‌హుసేన్, కృష్ణారెడ్డి, కళాజాత బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో 'పది' హాల్‌టికెట్లు



అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.వాట్సాప్ మనమిత్ర నంబరు 95523 00009 ద్వారా హాల్‌టికెట్లు పొందవచ్చన్నారు. అలాగే www.bse. ap.gov.in వెబ్‌సైట్ నుంచి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వెల్లడించారు. హాల్‌టికెట్లలో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, మీడియం, ఫొటో, సంతకం తదితర వివరాలు తప్పుగా ఉంటే వెంటనే ప్రధానోపాధ్యాయుల ద్వారా dir_govexams@yahoo.com మెయిల్‌కు ఫిర్యాదు చేయాలని డీఈఓ, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ తెలిపారు. అనంతపురంలోని పాత డీఈఓ కార్యాలయం, ప్రభుత్వ పరీక్షల విభాగంలో కూడా సంప్రదించవచ్చని సూచించారు.

నెలాఖరు వరకూ ఆ ప్యాసింజర్ రైళ్లు తిరగవ్!



గుంతకల్లు: కుంభమేళాకు వెళ్లిన ప్యాసింజర్ రైళ్లు తిరిగి గుంతకల్లు డివిజన్ చేరుకునేందుకు ఈ నెలాఖరు వరకూ పడుతుందని డివిజన్ అధికారులు తెలిపారు.ఈ క్రమంలో తిరుపతి–కదిరిదేవరపల్లి (57405) ప్యాసింజర్ రద్దును ఈ నెల 30 వరకూ పొడిగించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా కదిరిదేవరపల్లి–తిరుపతి (57406) ప్యాసింజర్ ఈ నెల 31 వరకు, గుంతకల్లు–తిరుపతి (57404) ప్యాసింజర్ 30 వరకు, తిరుపతి–గుంతకల్లు (57403) ప్యాసింజర్ ఈ నెల 31 వరకు తిరగవన్నారు. తిరుపతి–హుబ్లీ (57401) ప్యాసింజర్‌ను ఈ నెల 15 వరకు, హుబ్లీ–తిరుపతి ప్యాసింజర్ రద్దును ఈ నెల 16 వరకూ పొడిగించినట్లు వెల్లడించారు.

బొక్కడంలో తేడాతో బజారుపాలు!



హెచ్చెల్సీలో ఓ అవినీతి బాగోతం వెలుగుచూసింది. రైతులు పండించిన పంటను దళారులే కాకుండా అధికారులు కూడా బొక్కేస్తున్న వైనం సర్వత్రా చర్చకు దారితీస్తోంది. అనేక సంవత్సరాలుగా నడుస్తున్న ఈ తతంగం... తాజాగా పంపకాల్లో తేడాలతో బట్టబయలైంది.

హెచ్చెల్సీలో అవినీతి బాగోతం

- రైతుల నుంచి ఇష్టారాజ్యంగా ధాన్యం వసూళ్లు
- ప్రతి ఏటా దందా
- ఈ సారి తేడాలు రావడంతో రచ్చ
- ఈఎన్‌సీ ఆదేశాలతో గుట్టుగా విచారణ



హెచ్చెల్సీ కార్యాలయం

అనంతపురం సెంట్రల్: తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) ద్వారా ప్రతి ఏటా లక్ష ఎకరాలకు పైగా సాగునీరు అందిస్తున్నారు. ఇందులో రాయదుర్గం నియోజకవర్గంలోని కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లోనే 40 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో పంటలు సాగవుతున్నాయి. ఇక్కడి రైతుల్లో సింహభాగం వరిని సాగు చేస్తున్నారు. జిల్లాలో పండిస్తున్న వరిధాన్యంలో సగం ఈ ప్రాంతం నుంచే ఉత్పత్తి అవుతోంది.

బలవంతంగా వసూళ్లు..

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ(హెచ్‌ఎల్‌ఎంసీ)లో డిస్ట్రిబ్యూటరీల కింద సాగు చేస్తున్న రైతుల నుంచి ఎకరాల ప్రకారం అక్రమంగా ధాన్యం వసూలు చేస్తున్నారు. హెచ్చెల్సీ ఆయకట్టుకు నీరు అందించే లస్కర్లు, డీఈ స్థాయి అధికారులు కుమ్మక్కై ఈ బాగోతం నడిపిస్తున్నారు. ఏదో బస్తానో రెండు బస్తాలో కాకుండా ఏటా రూ. లక్షలు విలువజేసే ధాన్యం అక్రమంగా సేకరిస్తున్నారని తెలుస్తోంది. అనధికారికంగా పంటలు సాగు చేసుకునే రైతుల నుంచైతే రెట్టింపు స్థాయిలో తీసుకుంటున్నట్లు సమాచారం. ఇలా సేకరించిన ధాన్యాన్ని స్థానికంగా మిల్లుల్లో ఆడించిన అనంతరం విక్రయించి... ఆ వచ్చే డబ్బును వాటాలుగా పంచుకోవడం ఆనవాయితీగా మార్చుకున్నారు. అయితే ఈ సారి లస్కర్లు, ఓ డీఈకి మధ్య పంపకాల్లో తేడాలు రావడంతో వివాదం రేగింది. ఒకరిపై ఒకరు నేరుగా ఈఎన్‌సీ (ఇంజినీర్ ఇన్ చీఫ్)కి ఫిర్యాదు చేసుకున్నారు. స్పందించిన ఆయన... వాస్తవాలను నిగ్గు తేల్చాలంటూ జిల్లా చిన్ననీటి పారుదలశాఖ ఎస్‌ఈ విశ్వనాథరెడ్డిని విచారణ అధికారిగా నియమించారు. దీనిపై గుట్టుగా విచారిస్తున్నారు.

సర్వత్రా విమర్శలు..

ఆరుగాలం శ్రమించి పంట పండించే రైతులకు వచ్చే ఆదాయం అంతంత మాత్రమే. ఒకవైపు పెట్టుబడులు తడిసి మోపెడవుతుంటే.. మరోవైపు చీడపీడల ధాటికి అల్లాడిపోతున్నారు. ఇక ప్రకృతి కోపిస్తే నష్టాలను మూటగట్టుకోవాల్సిందే. ఇలాంటి పరిస్థితుల్లో అన్నదాతలకు అండగా నిలవాల్సింది పోయి పీల్చిపిప్పి చేస్తున్న వైనం విమర్శలకు దారితీస్తోంది.

ఫిర్యాదులొచ్చాయి..



కణేకల్లు మండలంలో ధాన్యం వసూళ్లపై ఫిర్యాదులు వస్తున్నాయి. గతంలో కూడా ఫిర్యాదులు రావడంతో విచారణ చేశారు. ఈ ఏడాది మళ్లీ వచ్చాయి. అక్కడ ఉద్యోగుల మధ్య వివాదం కారణంగా ఇలా జరుగుతోంది. దీనిపై మైనర్ ఇరిగేషన్ ఎస్‌ఈ విచారిస్తున్నారు.

– రాజశేఖర్, ఎస్‌ఈ, హెచ్చెల్సీ

విచారణ జరుగుతోంది..



ఈఎన్‌సీ ఆదేశాల మేరకు కణేకల్లులో ఓ డీఈ, లస్కర్లపై విచారణ చేస్తున్నాం. అసలు అక్కడ ఏం జరుగుతోందో తెలియడం లేదు. విచారణ పూర్తయితే తప్ప చెప్పలేం. త్వరలో దీనిపై నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తాం.

– విశ్వనాథరెడ్డి, ఎస్‌ఈ, చిన్న నీటిపారుదల శాఖ

గవిమఠం చంద్రమౌళీశ్వరుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



గంగా జలాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం

ఉరవకొండ: ప్రసిద్ధి గాంచిన ఉరవకొండ గవిమఠం చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. గవిమఠం పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవ రాజేంద్రస్వామి ఆధ్వర్యంలో కంకణ ధారణ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గవిమఠం ఆవరణం నుంచి గంగాజలాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లారు. కంకణ మండపంలో కుండల్లో మట్టి వేసి నవధ్యానాలు ఉంచారు. బ్రహ్మోత్సవాలు ముగిసేలోపు మట్టికుండలో ధాన్యాలు బాగా పండితే పంటలు చేతికొచ్చి రైతులు సుభిక్షంగా ఉంటారని భక్తుల విశ్వాసం. కార్యక్రమంలో ఆదోని చౌకి మఠం పీఠాధిపతి కల్యాణ స్వామీజీ, గవిమఠం ఏజెంట్ రాజన్నగౌడ్ పాల్గొన్నారు.

రథోత్సవాన్ని విజయవంతం చేద్దాం

చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మరథోత్సవాన్ని విజయవంతం చేద్దామని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ నెల 9న రథోత్సవం జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లు, భక్తులకు సదుపాయాలు, పోలీసు భద్రత తదితర అంశాలపై ఉరవకొండ తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ బ్రహ్మోత్సవానికి తరలివచ్చే భక్తులకు ఎక్కడా చిన్న ఇబ్బంది కూడా తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్, గవిమఠం మేనేజర్ కె.రాణి, తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఎంపీడీఓ రవిప్రసాద్, అర్బన్ సీఐ మహానంది తదితరులు పాల్గొన్నారు.

నకిలీ నోట్ల ముఠా గుట్టు రట్టు

- 8 మంది నిందితుల అరెస్టు
- ల్యాప్‌టాప్, ప్రింటర్, రూ. 48 వేల విలువైన నకిలీ నోట్ల స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాస రావు

అనంతపురం: నగరంలో నకిలీ కరెన్సీ చెలామణి చేస్తున్న ఓ ముఠా గుట్టును వన్‌టౌన్ పోలీసులు రట్టు చేశారు. మొత్తం 8 మందిని అరెస్ట్ చేసి రూ.48 వేల విలువైన నకిలీ నోట్లు, ల్యాప్‌టాప్, ప్రింటర్, కట్టర్ స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అనంతపురం అర్బన్ డీఎస్పీ వి. శ్రీనివాస రావు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అనంతపురం బుడ్డప్పనగర్‌కు చెందిన దూదేకుల ఖాసీం, బోయ పవన్‌కుమార్, పడిగల సుకుమార్, బెళుగుప్ప మండలం జీడిపల్లి గ్రామానికి చెందిన బొమ్మినేని అశోక్ చౌదరి, అనంతపురం సంఘమిత్ర నగర్‌వాసి దేవరకొండ రవీంద్ర స్నేహితులు. దూదేకుల ఖాసీం గతంలో శ్రీ సత్యసాయి బాల వికాస్ స్కూల్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తూ, నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసేవాడు. దీంతో అతడిని అనంతపురం త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. జైలులో రిమాండ్ ఖైదీగా ఉండి, ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చాడు. అప్పటి నుంచి ఖాసీం ఇంటి వద్దే ఉంటున్నాడు. పెద్దవడుగూరు మండలంలో పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తూ సస్పెండ్ అయిన కృష్ణా రెడ్డి ఇతనికి పరిచయమయ్యాడు. ఇద్దరూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో, వాటి నుంచి బయటపడడానికి బోయ పవన్, పడిగల సుకుమార్, బొమ్మినేని అశోక్, రవీంద్రతో కలిసి నకిలీ కరెన్సీ తయారీకి పూనుకున్నారు. ఇందుకు కృష్ణా రెడ్డి ల్యాప్‌టాప్ ఇచ్చాడు. ముందుగా దేవరకొండ రవీంద్ర ఇచ్చిన రూ.20 వేలతో నగరంలోని కమలానగర్‌లో ఒక ప్రింటర్, పేపర్ కట్టర్, కలర్ జిరాక్స్ పౌడర్ పేస్ట్, బ్రష్‌లను కొనుగోలు చేశారు. అశోక్ చౌదరి సమకూర్చిన రూ.10 వేలతో బెంగళూరులో పేపర్ కొన్నారు. బుడ్డప్పనగర్‌లోని సుకుమార్ ఇంట్లో నకిలీ కరెన్సీ తయారు చేశారు. ముందుగా కొంత కరెన్సీని ధర్మవరం నగరానికి చెందిన సత్యనారాయణ అలియాస్ సత్తికి ఇచ్చారు. ఈ క్రమంలోనే మంగళవారం దేవరకొండ రవీంద్ర ద్వారా టీవీ టవర్ సమీపంలోని ఓ ఫంక్షన్ హాలు వద్ద పెద్దపప్పూరు మండలం చిక్కేపల్లి గ్రామానికి చెందిన నొస్సాం మురళీమోహన్ రెడ్డి, రాప్తాడు కళాకారుల కాలనీకి చెందిన సాకే రామాంజినేయులు అలియాస్ పొట్టి రామాంజి, అనంతపురం నాయక్ నగర్‌కు చెందిన యలమకూరి రామాంజినేయులు అలియాస్ దుబ్బ రామాంజిలకు దొంగ నోట్లు ఇస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.48 వేల విలువైన నకిలీ నోట్లు స్వాధీనం చేసుకున్నారు.

మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహిద్దాం



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8వ తేదీన జేఎన్‌టీయూ ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఇందుకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. కార్యక్రమ నిర్వహణకు హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను నోడల్ అధికారిగా నియమిస్తున్నామన్నారు. అదే రోజు 2కే మారథాన్ నిర్వహించాలన్నారు. స్టాల్స్, మహిళలకు హెల్త్ చెకప్, వైద్య శిబిరాలు, న్యూట్రిషన్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వివిధ రంగాల్లో సత్తా చాటుతున్న మహిళలను సన్మానించాలన్నారు. మహిళా అధికారులందరూ తప్పక హాజరు కావాలని సూచించారు.

మహిళలకు రుణాలివ్వాలి..

మహిళా దినోత్సవం సందర్భంగా బ్యాంకర్లతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాలు ఇవ్వాలన్నారు. పీఎంఈజీపీ, ఎంఎస్‌ఎంఈ రుణాలు, పీఎం విశ్వకర్మ, ముద్ర రుణాలు మంజూరు చేయాలని చెప్పారు. సమావేశంలో డీఆర్‌ఓ మలోల, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఎల్‌డీఎం నర్సింగ రావు, డీఎంహెచ్‌ఓ ఈబీదేవి, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, మెప్మా పీడీ విశ్వజ్యోతి, ఏడీసీసీ బ్యాంక్ సీఈఓ సురేఖరాణి, పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్, నోడల్ అధికారి ఇషాంత్, కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకూడదు

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని చెప్పారు. తన క్యాంపు కార్యాలయం నుంచి డీఆర్‌ఓ, ఆర్డీఓలు, మునిసిపల్ కమిషనర్లు, డీఎల్‌డీఓలు, ఎంపీడీఓలు, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వేసవి కార్యాచరణ ప్రణాళిక, సానుకూల ప్రజా అవగాహన, అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఎంఎస్‌ఎంఈ పార్కు, ఫీడర్ లెవల్ పోలరైజేషన్ స్కీమ్‌కు ప్రభుత్వ భూమి కేటాయింపు, ఎంఎస్‌ఎంఈ సర్వే తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు.

ఉచిత వైద్యం అందాలి

'ఎన్‌టీఆర్ వైద్యసేవ ట్రస్ట్' ద్వారా పేదలకు ఉచిత వైద్యం కచ్చితంగా అందించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎన్‌టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ జిల్లా క్రమశిక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపానల్ ఆస్పత్రుల్లో వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. రోగుల నుంచి డబ్బు వసూలు చేయకూడదన్నారు. డబ్బు వసూలు చేస్తున్నట్లు క్షేత్రస్థాయిలో ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే సంబంధిత ఆస్పత్రికి నోటీసు ఇచ్చి విచారణ కోరాలన్నారు. ఆర్‌టీజీఎస్, ఐవీఆర్‌ఎస్ ద్వారా నేరుగా ప్రజలకు ఫోన్ చేసి ఆస్పత్రుల్లో వైద్యులు అందుబాటులో ఉన్నారా.. సిబ్బంది ప్రవర్తన ఎలా ఉంది..వైద్య మిత్రలు, ఆస్పత్రి సిబ్బంది ఎవరైనా డబ్బులు అడిగారా.. మందులు అక్కడే ఇస్తున్నారా.. పరిశుభ్రత ఎలా ఉంది.. తదితర అంశాలపై ప్రభుత్వం ఆరా తీస్తోందని, వీటిలో ఎక్కడైనా తేడా వస్తే ఆ ఫిర్యాదు తమకు వస్తుందని కలెక్టర్ చెప్పారు. సమావేశంలో ఎన్‌టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ కో–ఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ ఈబీదేవి, డీసీహెచ్‌ఎస్ పాల్ రవికుమార్, రిటైర్డ్ సూపరింటెండెంట్ లక్ష్మణ్‌ప్రసాద్, ఆస్పత్రుల అధిపతులు పాల్గొన్నారు.

ట్రాప్.. గప్‌చుప్!



- అనంతపురం నగరంలోని ఎన్టీఆర్ మార్గ్‌లో రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా ఓ వ్యక్తి భూమి పోయింది. ఇందుకు పరిహారం మంజూరు కోసం బాధితుడు మున్సిపాలిటీ అధికారులను ఆశ్రయించగా.. ఓ మహిళా అధికారి రూ.3 లక్షలు డిమాండ్ చేశారు. డబ్బు ఇవ్వలేదనే కారణంతో మూడేళ్లుగా అతడిని తిప్పించుకుంటున్నారు.
- అనంతపురంలోని రాజు రోడ్డులో ఓ బంగారు నగల దుకాణ భవనం నిర్మాణమవుతోంది. ఇక్కడ సెల్లార్‌లోకి వెళ్లేందుకు ర్యాంప్ వేశారు. ర్యాంప్ కారణంగా వర్షం నీళ్లు సరిగా వెళ్లవంటూ ఇటీవల మున్సిపల్ సిబ్బంది ఆ భవన నిర్మాణం వద్ద కూర్చున్నారు. 'మమ్మల్ని మున్సిపల్ అధికారి మంజుల మేడం పంపించారు. మాకెంతో కొంత ఇస్తేగానీ వెళ్లం' అంటూ తెగేసి చెప్పారు.
- అనంతపురం ఆర్డీఓ కార్యాలయానికి ఇటీవల శింగనమలకు చెందిన ఓ వ్యక్తి భూమి కన్వర్షన్ కోసం వెళ్లారు. 'రూ.3 లక్షలు ఇస్తేనే పని పూర్తి చేస్తాం' అంటూ రెవెన్యూ అధికారులు ఆయనకు కరాఖండీగా చెప్పారు. వారు అడిగినంత ముట్టజెప్పి బాధిత రైతు పని పూర్తి చేసుకున్నారు.

దిక్కులేని ఏసీబీ

- జిల్లాలో వేళ్లూనుకుపోతున్న అవినీతి
- ట్రాప్ చేయలేకపోతున్న ఏసీబీ
- కూటమి సర్కారు వచ్చాక నిర్వీర్యం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లా వ్యాప్తంగా అవినీతి వేళ్లూనుకుంటోంది. చిన్న ఫైలుపై సంతకం చేయాలన్నా మామూళ్లివ్వాల్సిన దుస్థితి నెలకొంది. చివరకు భూముల సర్వేకు చలానా కడితే సర్వేయర్‌కు కూడా లంచం ఇవ్వాల్సి వస్తోంది. కూటమి సర్కారు వచ్చినప్పటి నుంచి జిల్లాలో అన్ని విభాగాల్లోనూ ఇదే తీరు నడుస్తోంది. రెవెన్యూ, కమర్షియల్ ట్యాక్స్, మున్సిపాలిటీ విభాగాల్లో పరిస్థితి మరీ దారుణంగా తయారైందన్న విమర్శలున్నాయి. ఇలాంటి విషయాలపై నిఘా ఉంచి కట్టడి చేయాల్సిన ఏసీబీ (యాంటీ కరప్షన్ బ్యూరో) అధికారులు అసలు ఎక్కడా కానరావడమే లేదు.

ఎనిమిది నెలల్లో ఒక్క కేసూ లేదు!

గత ప్రభుత్వ హయాంలో భారీగా ఏసీబీ దాడులు జరిగాయి. అప్పట్లో లంచం తీసుకోవాలంటే అధికారులు భయపడేవారు. ఇప్పుడైతే ఏసీబీని ఎవరూ లెక్కచేయడం లేదు. 'ముడుపులిస్తేనే పనులవుతాయి. లేదంటే లేదు' అని కరాఖండీగా చెబుతున్నారు. ఏసీబీ అధికారులు చురుగ్గా ఉండి ఉంటే భయపడి అడిగే వారు కాదు. కానీ జిల్లాలో ఎక్కడా 'ఏసీబీ' అనే మాటే వినిపించడం లేదు. జిల్లా ఏసీబీకి కనీసం తాత్కాలిక డీఎస్పీ కూడా లేరు. గతంలో ఉన్న శివనారాయణ బదిలీపై కదిరి డీఎస్పీగా వెళ్లారు. ఏసీబీ సీఐగా ఉన్న శాంతిలాల్ త్రీటౌన్ సీఐగా నియమితులయ్యారు. దీంతో ఇప్పుడక్కడ ఎవరూ లేరు. విజిలెన్స్ అధికారులు అడపాదడపా దాడులు నిర్వహిస్తున్నా వారికి అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచే అధికారం ఉండదు. దీంతో వసూల్ రాజాలు రెచ్చిపోతున్నారు.



ఫిర్యాదులకు స్పందించేదెవరు?

ఇటీవలి కాలంలో కలెక్టర్ వివిధ ప్రాంతాల్లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మిగతా జిల్లాలతో పోలిస్తే జిల్లాలో ఫిర్యాదులు భారీగా అందుతున్నాయి. ఎక్కడ ఈ కార్యక్రమం నిర్వహించినా వేల మంది వినతులతో పోటెత్తుతున్నారు. ఇంతమందిలో ఇద్దరూ ముగ్గురైనా ఏసీబీకి కచ్చితంగా ఫిర్యాదు చేసే ఉంటారు. సదరు విభాగం అధికారులు స్పందించి ఉంటే ఎనిమిది నెలల్లో ఒక్క ట్రాప్ అయినా చేసి ఉండాలి. కానీ జిల్లాలో ఆ విభాగం పనిచేస్తున్న దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు.

వైభవం..గావుల మహోత్సవం

కనగానపల్లి: ఉరుముల శబ్దాలు, పోతురాజుల నృత్య విన్యాసాలు, భక్తుల కోలాహలం మధ్య దాదులూరు పోతలయ్యస్వామి గావుల మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. స్వామి కాపులు, భక్తులు వేకువజామునే ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి వారికి బోనాలు సమర్పించారు. అనంతరం ఉరుముల శబ్దాలకు అనుగుణంగా పోతురాజులు నృత్య విన్యాసాలు చేసుకుంటూ ఆలయంలోకి వచ్చారు. ఆలయ పూజార్లు పోతలయ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల కోలాహలం మధ్య 11 మంది పోతురాజులు మేకపోతు పిల్లలను స్వామికి గావుల (బలి) మహోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు ఆలయం ముందు పొట్టేళ్లు, మేకపోతులను బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. పోతలయ్యస్వామి గావుల మహోత్సవాన్ని తిలకించేందుకు ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయ ఆవరణం కిక్కిరిసిపోయింది.



పోతలయ్యస్వామి మూలవిరాట్



గావుల మహోత్సవం సందర్భంగా భక్తులతో నిండిన పోతలయ్యస్వామి ఆలయం

క్లుప్తంగా

ఆర్ఎంపీలు పరిధికి మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు

- డీఎంహెచ్ఓ ఈబీ దేవి



మాట్లాడుతున్న డాక్టర్ ఈబీదేవి

రాయదుర్గంటౌన్: ఆర్ఎంపీలు ప్రాథమిక వైద్యం మాత్రమే చేయాలని, వారి పరిధికి మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి హెచ్చరించారు. ఇటీవల రాయదుర్గంలోని బళ్లారి రోడ్డులో ఉన్న ఆర్ఎంపీ వైద్యుడు చన్నవీర వైద్యం వికటించి ఓ యువకుడు మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యులతో విచారణ అనంతరం స్థానిక ఎపీఎన్జీఓ భవనంలో అర్బన్, రూరల్ పరిధిలోని ఆర్ఎంపీలతో ఆమె సమావేశమై మాట్లాడారు. ప్రాథమిక చికిత్స దాటి ఎవరైనా ఆర్ఎంపీలు వైద్యం అందజేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే కచ్చితంగా వారిపై చర్యలతోపాటు సర్టిఫికెట్ రద్దు చేస్తామన్నారు. ఇంజక్షన్లు వేయడం, సెలైన్ ఎక్కించడం లాంటి వైద్యం చేయరాదన్నారు. సమావేశంలో వైద్యులు రమేష్, మోహన్‌సాయి, సందీప్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నాగేంద్రప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి మృతదేహం వెలికితీత

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన దుర్గేష్, ప్రీతి దంపతుల కుమారుడు దర్శిత్ (12) ఆదివారం ఈతకు వెళ్లి నీటి కుంటలో గల్లంతైన విషయం తెలిసిందే. విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువుల సమాచారంతో కదిరి రూరల్ పోలీసులు, ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్లు అక్కడకు చేరుకుని సోమవారం ఉదయం నుంచి గాలింపు చేపట్టారు. మంగళవారం ఉదయం బాలుడు దర్శిత్ మృతదేహం లభ్యమైంది. కుమారుడి మృతదేహాన్ని చూడగానే తండ్రి సొమ్మసిల్లిపోయాడు. కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

పాతవే ముద్దు.. కొత్తవి వద్దు

అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధకశాఖ పరిధిలో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన నూతన భవనాలు వృథాగా మారాయి. అన్ని వసతులతో నిర్మించిన పెద్ద పెద్ద భవనాల్లో ఒకరిద్దరు పనిచేస్తుండగా పాతబడిన భవనంలోనే పూర్తి స్థాయి సిబ్బంది విధులు నిర్వర్తిస్తుండడం గమనార్హం. ఖాళీగా ఉన్న కొత్త భవనాల్లో కృత్రిమ గర్భోత్పత్తికి సంబంధించిన సామగ్రితో పాటు కొన్ని మందులు పెడుతున్నారు. ఇదీ పశుసంవర్ధకశాఖ జేడీ కార్యాలయ ప్రాంగణంలోని భవనాల దుస్థితి.



ఐదేళ్ల క్రితం రూ.72 లక్షలతో గొర్రెల అభివృద్ధి విభాగం కింద నిర్మించిన ఈ అతి పెద్ద భవనంలో ఒక్కరు కూడా విధులు నిర్వర్తించడం లేదు. నిర్వహణ లేకపోవడంతో గోడలు నెర్రెలు బారాయి. బాత్‌రూంలు కంపుకొడుతున్నాయి.

జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ (డీఎల్‌డీఏ) ఆధ్వర్యంలో రూ.70 లక్షలు వెచ్చించి అధునాతన వసతులతో నిర్మించిన అతి పెద్ద భవనంలో డీఎల్‌డీఏ ఈఓ, ఓ డాక్టర్, మరొక సిబ్బంది... కేవలం ముగ్గురు మాత్రమే పనిచేస్తున్నారు. మిగిలిన గదులు, హాలు నాలుగైదు సంవత్సరాలుగా వృథాగా ఉన్నాయి.





దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ పాత భవనంలోనే జేడీతో పాటు ఏడీలు, డాక్టర్లు, ఇతర కార్యాలయ మినిస్టీరియల్ స్టాఫ్ 25 మంది వరకు పనిచేస్తున్నారు. ఈ పాత భవనాల పైకప్పులు రాలి పడుతుంటాయి. గోడలు నెర్రెలు బారాయి. వానొస్తే భవనం కారుతుంది. అయినా అందులోనే విధులు నిర్వర్తిస్తున్నారు.



జేడీ కార్యాలయ ఆవరణలోనే డీడీ కార్యాలయ భవనమూ నిర్మించారు. ఇందులోనూ డీడీ, ఏడీతో పాటు కార్యాలయ సిబ్బంది పనిచేస్తున్నారు. ఇక్కడే 50 ఏళ్ల కిందట నిర్మించిన మరో భవనం రేపోమాపో కూలిపోయే స్థితిలో ఉంది. పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నా ఈ భవనంలో కృత్రిమ గర్భోత్పత్తి మందులు, క్యాన్లు, ఇతర సామగ్రి డంప్ చేశారు.

బదిలీల్లో ప్రాధాన్యతనివ్వాలి

- వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీల్లో వితంతు, లీగల్లీ సపరేట్ మహిళా ఉపాధ్యాయులకు ప్రిఫరెన్షియల్ కేటగిరీల్లో ప్రాధాన్యత ఇవ్వాలని వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, రాష్ట్ర నాయకులు గోపాల్, వెంకటరమణప్ప డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో వారిని పలువురు మహిళా టీచర్లు కలసి తమ సమస్యలు విన్నవించారు. వితంతు, లీగల్లీ సపరేటెడ్ మహిళా ఉపాధ్యాయులకు బదిలీ చట్టంలో కేవలం పాయింట్లు మాత్రమే కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి మాట్లాడుతూ.. వితంతు, లీగల్లీ సపరేట్ మహిళా ఉపాధ్యాయులకు ప్రిఫరెన్షియల్ కేటగిరిలోనే బదిలీలు నిర్వహించాలన్నారు. గతంలో మహిళలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తూ చైల్డ్ కేర్ లీవులు కూడా 180 రోజులకు పెంచారని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం కూడా మహిళా ఉద్యోగుల పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని కోరారు.

యువకుడి బలవన్మరణం

గుత్తి: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని పత్తికొండ రైల్వే గేటు వద్ద మంగళవారం తెల్లవారుజామున రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్‌పీ ఎస్ఐ నాగప్ప తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన సురేష్ (25) కర్ణాటకలోని రాయచూర్‌లో ఉన్న ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం ఓబులాపురం బయలుదేరిన సురేష్ మంగళవారం తెల్లవారుజామున రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక పరమైన అంశాలే ఆయన ఆత్మహత్యకు కారణాలుగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రేమ తెచ్చిన తంటా... జైలుపాలైన విద్యార్థి

రాప్తాడు రూరల్: ప్రియురాలిపై హత్యాయత్నం చేసిన కేసులో ఎస్కేయూ పీజీ విద్యార్థి జైలు పాలయ్యాడు. ఇటుకలపల్లి పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలానికి చెందిన కురుబ బ్యాళ్ల విష్ణువర్ధన్ ఎస్కేయూలో ఎంఎల్ఐసీ చదువుతున్నాడు. ఈ క్రమంలో ఎస్కేయూలో బీటెక్ చేస్తున్న అనంతపురం రూరల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతితో పరిచయమై, ప్రేమకు దారితీసింది. ఇద్దరూ సన్నిహితంగా ఉన్న సమయంలో ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు. కొంత కాలంగా ఆమె స్వగ్రామానికి చెందిన మరో యువకుడితో చనువుగా ఉంటోందన్న అనుమానంతో విష్ణువర్ధన్ రగిలిపోయాడు. ఫిబ్రవరి 27న యువతిని ఓ గదికి తీసుకెళ్లి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా వారిద్దరూ చనువుగా ఉన్న సమయంలో తీసుకున్న ఫొటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశాడు. ఘటనకు సంబంధించి బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఇటుకలపల్లి పోలీసులు... అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు నేతృత్వంలో దర్యాప్తు వేగవంతం చేశారు. మంగళవారం ఉదయం పూలకుంట గ్రామ శివారులోని కురుబ తిమ్మప్పస్వామి గుడి వద్ద తచ్చాడుతున్న నిందితుడు బ్యాళ్ల విష్ణువర్ధన్‌ను గుర్తించి అరెస్ట్ చేశారు. అతడి నుంచి ఓ ద్విచక్ర వాహనంతో పాటు మూడు సెల్‌ఫోన్లు, ఫొటోలు, వీడియోలు ఉన్న పెన్‌డ్రైవ్ స్వాధీనం చేసుకుని, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

బాలిక దుర్మరణం



సుశీల (ఫైల్)

రాయదుర్గం టౌన్: మండలంలోని 74 ఉడేగోళం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకున్న ప్రమాదంలో ఓ బాలిక దుర్మరణం పాలైంది. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని సందూరు తాలూకా వడ్డేరహళ్లికి చెందిన దాదాపు 25 మంది బొలెరో వాహనంలో బయలుదేరి కుందుర్పి మండలం బెస్తరపల్లిలో సోమవారం జరిగిన బొమ్మలింగేశ్వరస్వామి జాతరలో పాల్గొన్నారు. అదే రోజు తిరుగు ప్రయాణమైన వారు రాత్రి 11 గంటల సమయంలో రాయదుర్గం పట్టణ శివారులోని 74 ఉడేగోళం సమీపంలోకి చేరుకోగానే జాతీయ రహదారిపై అడ్డుగా వచ్చిన కుక్కను డ్రైవర్ గమనించి సడన్ బ్రేక్ వేయడంతో వాహనం చివర నిద్రిస్తున్న సుశీల(15) కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. కింద పడిన వీరమాసెన్న, మురెగప్పకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న సీఐ జయానాయక్, సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను పోలీసు వాహనంలోనే ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బళ్లారికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సొల్లాపురంలో చోరీ

కణేకల్లు: మండలంలోని సొల్లాపురం గ్రామ శివారులో నివాసముంటున్న గుర్రం లక్ష్మణ్ణచౌదరి ఇంట్లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆలయ నిర్మాణం కోసం బీరువాలో ఉంచిన నగదును దుండగులు అపహరించారు. నాలుగేళ్ల క్రితం గ్రామంలో నూతనంగా సీతారామాలయం నిర్మించాలని గ్రామస్తులు నిర్ణయం తీసుకొన్నారు. ఈ క్రమంలో రూ.2.50 కోట్లను విరాళాల రూపంలో సేకరించి, నిర్మాణ పనులు చేపట్టాలని నిర్ణయించి, ఆ మేరకు ఆలయ నిర్మాణానికి అంకుర్పారణ చేసిన విశ్రాంత ఇంజనీర్ గుర్రం లక్ష్మణ్ణచౌదరికి బాధ్యతలను అప్పగించారు. ఏప్రిల్ నెలాఖరున బసవ జయంతి నాడు ఆలయాన్ని ప్రారంభించాలనే ఉద్దేశ్యంతో నిర్మాణ పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కూలీల వేతనాలు, సామగ్రి కొనుగోలు కోసం డబ్బు అవసరముండటంతో లక్ష్మణ్ణచౌదరి తన ఇంటిలోని బీరువాలో కొంత మొత్తాన్ని భద్రంగా ఉంచాడు. శనివారం కళ్యాణదుర్గం వాసవీకన్యకాపరమేశ్వరీ ట్రస్ట్ నిర్వాహకులు విరాళంగా అందజేసిన రూ.2లక్షలను లక్ష్మణ్ణచౌదరికి పూజారి అప్పగించారు. ఈ మొత్తంతో కలిపి బీరువాలో రూ.10లక్షల వరకు డబ్బు ఉంచి శనివారం ఆలయం నిర్మాణ పనులు ముగించుకుని రాత్రికి లక్ష్మణ్ణ చౌదరి అనంతపురానికి వెళ్లారు. సోమవారం అర్ధరాత్రి దుండగులు ఇంటి తాళాన్ని బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించి, బీరువాలోని డబ్బును అపహరించారు. విషయం తెలుసుకున్న రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, కణేకల్లు ఎస్ఐ నాగమధు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఎరువుల ర్యాక్ పాయింట్‌లో జేసీ తనిఖీలు

రాప్తాడు: మండలంలోని ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ వద్ద ఉన్న ఎరువుల ర్యాక్ పాయింట్‌ను మంగళవారం జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ శర్మ తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, వాటిని వాహనాల్లోకి లోడ్ చేస్తున్న తీరు, ఆ వాహనాలు ఏ ప్రాంతానికి వెళుతున్నాయి, తదితర అంశాలను పరిశీలించారు. ప్రతి వాహనానికి వే బిల్, స్టాక్ వివరాలు తెలిపే ఇన్వాయిస్ బిల్లు కచ్చితంగా ఉండాలన్నారు. అనంతరం అవేజ్ ఫర్టిలైజర్స్ గోదామును పరిశీలించారు. అక్కడ వివిధ డీలర్లకు సంబంధించిన ఎరువుల స్టోరేజ్‌పై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏడీఏ రవికుమార్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి, రాప్తాడు, బీకేఎస్ మండల వ్యవసాయాధికారులు శ్రీవాణి, శ్యామ్ సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుంకలా పార్వతీదేవి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

విడపనకల్లు: మండలంలోని పాల్తూరులో వెలసిన సుంకలాపార్వతీదేవి రథోత్సవం మంగళవారం వైభవంగా సాగింది. మండల వాసులతో పాటు ఉరవకొండ, బూదగవి, కర్ణాటకలోని రూపనగుడి, శంకరబండ, బళ్లారి, తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి.

50 శాతం రాయితీతో యాంత్రీకరణ పనిముట్లు

అనంతపురం అగ్రికల్చర్: పీఎం–ఆర్‌కేవీవై, ఎస్ఎంఏఎం పథకాల కింద ప్రస్తుత 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను రైతులకు 50 శాతం రాయితీతో 1,661 యాంత్రీకరణ పనిముట్ల మంజూరుకు రూ.2.86 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏపీ ఆగ్రోస్ ద్వారా 250 స్ప్రేయర్లు, 600 పవర్ ఆపరేటెడ్ స్ప్రేయర్లు, ఏడు ట్రాక్టర్ ఆపరేటెడ్ స్ప్రేయర్లు, 740 ట్రాక్టర్ డ్రాన్ సీడర్ పరికరాలు, 28 రోటావీటర్లు, 18 పవర్‌వీడర్లు, 13 బ్రష్ కట్టర్లు, ఐదు పవర్ టిల్లర్లు ఇవ్వనున్నారు. గత ఐదేళ్లగా పనిముట్లు లబ్ధిపొందని ఎస్సీ ఎస్టీ మహిళా రైతులు, చిన్న సన్నకారు రైతులు అర్హులు. ఈ–పంట నమోదు తప్పనిసరిగా ఉండాలి. అటవీ భూముల సాగుదారులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కుటుంబంలో ఒక రైతుకు మాత్రమే లబ్ధి చేకూరుతుంది. ట్రాక్టర్ కలిగిన రైతులు మాత్రమే వాటికి సంబంధించిన పనిముట్లకు దరఖాస్తు చేసుకోవాలి. రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి ఈ నెల 26 లోపు దరఖాస్తులు అందజేయాలి.



మాట్లాడుతున్న జేడీఏ ఉమామహేశ్వరమ్మ

ఏపీఎఫ్ఆర్ గుర్తింపు కార్డు తప్పనిసరి : జేడీఏ

యాడికి: ఏపీ ఫార్మర్ రిజిస్ట్రీ(ఏపీఎఫ్ఆర్) గుర్తింపు కార్డు కలిగి ఉంటేనే భవిష్యత్తులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తాయని, రైతులందరూ తప్పనిసరిగా ఏపీఎఫ్ఆర్ కార్డును పొందాలని జేడీఏ ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. యాడికి మండలం వేములపాడులోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె రైతులతో సమావేశమై మాట్లాడారు. రైతు గుర్తింపు కార్డులు లేకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు వర్తించవన్నారు. రబీలో దిగుబడులు సరిగ్గా లేనందున యాడికి మండలాన్ని కరువు ప్రాంతంగా ఖరారు చేయుటకు ప్రతిపాదనలు పంపామన్నారు. పంటల యాజమాన్యంపై ఎప్పటికప్పుడు రైతు సేవాకేంద్రం ద్వారా సలహాలు తీసుకుని మంచి దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా, వ్యవసాయ విస్తరణ అధికారి జహీరూన్, గ్రామ వ్యవసాయ అధికారి సతీష్ బాబు పాల్గొన్నారు.

ఈ –క్రాప్ నమోదు త్వరగా పూర్తి చేయండి

పెద్దవడుగూరు: రబీ పంటకు సంబంధించి రైతులు సాగు చేసిన పంటల వివరాల ఈ క్రాఫ్ నమోదు త్వరగా పూర్తి చేయాలని సంబంధింత అధికారులను జేడీఏ ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. మంగళవారం పెద్దపప్పూరు మండలం జూటూరులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏపీఎఫ్ఆర్ గుర్తింపు కార్డు ప్రాధాన్యతపై చైతన్య పరిచారు. కంది పంటకు ప్రభుత్వం రూ.7,550 గిట్టుబాటు ధర కల్పించిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ అంజనేయులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వాహనంలో లోపాలకు కంపెనీ, డీలరే బాధ్యులు

- మోటార్ సైకిల్ ధర రూ.76 వేలు, మనోవేదనకు రూ.50 వేలు చెల్లించాలి
- వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు ఎం. శ్రీలత తీర్పు

అనంతపురం: వాహనంలో తలెత్తిన లోపానికి కంపెనీతో పాటు డీలర్ బాధ్యులు అవుతారని, వెంటనే బాధితుడికి వాహనం ధర రూ.76,700తో పాటు మనో వేదనకు గురి చేసినందుకు గాను రూ.50 వేలు, ఖర్చులు రూ.5 వేలు 45 రోజుల్లోపు చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు ఎం.శ్రీలత మంగళవారం తీర్పు వెలువరించారు. వివరాలు... గార్లదిన్నెకు చెందిన భూపాలం విష్ణువంశీ ఓ ప్రైవేట్ కంపెనీలో క్షేత్రస్థాయి ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. రోజువారీ విధుల్లో భాగంగా ద్విచక్ర వాహనంపై పలు ప్రాంతాలను ఆయన సందర్శించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో అనంతపురంలోని నరసింహా మోటార్స్ నుంచి న్యూఢిల్లీకి చెందిన హీరో మోటోకార్ప్ లిమిటెడ్ తయారు చేసిన హీరో మోటార్ సైకిల్ వాహనాన్ని 2021, జులై 7న కొనుగోలు చేశాడు. అయితే ఆ వాహనం కొనుగోలు చేసినప్పటి నుంచి పలుమార్లు మరమ్మతులకు లోనవుతూ వచ్చింది. ప్రతి సారీ షోరూంకు తీసుకెళ్లి చూపించడం, వారు మరమ్మతు చేసి ఇస్తూ వచ్చారు. ఈ క్రమంలోనే వాహనం మరోసారి మొరాయించడంతో షోరూమ్‌లోనే వదిలి తనకు వాహనాన్ని మార్చి ఇవ్వాలని విష్ణువంశీ కోరాడు. ఇందుకు డీలర్ అంగీకరించకపోవడంతో లీగల్ నోటీసులు పంపాడు. అయినా ఫలితం లేకపోవడంతో జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. కమిషన్ ద్వారా నోటీసులు అందుకున్న కంపెనీ ప్రతినిధులతో పాటు అనంతపురంలోని డీలర్ కూడా కమిషన్ ఎదుట హాజరై తమ వివరణ ఇచ్చారు. వాహనాన్ని అన్ని జాగ్రత్తలు తీసుకుని ఎలాంటి లోటుపాట్లు లేకుండా రూపొందిస్తామని తయారీదారులు పేర్కొన్నారు. ఏదో కారణంగా ఆగిపోయినంత మాత్రాన దానిని మార్చి కొత్త వాహనం ఇవ్వటం లేదా దాని ఖరీదు తిరిగి చెల్లించమని కోరడం సరికాదని తమ వాదనలు వినిపించారు. అయితే ఫిర్యాదుదారుడు తన వాదనకు అనువైన 20 పత్రాలను సాక్ష్యాలుగా చూపాడు. ఇరు పక్షాల వాదనలు విన్న తర్వాత వినియోగదారుడుకి లోపభూయిష్టమైన వాహనాన్ని విక్రయించినందుకు కంపెనీని, డీలర్‌ను బాధ్యుల్ని చేస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

ఆటో బోల్తా - డ్రైవర్ దుర్మరణం



మృతుడు వీరనారాయణ

శింగనమల: ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... శింగనమల మండలం ఆనందరావుపేటకు చెందిన వీరనారాయణ(56)కు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. మంగళవారం ఉదయం అదే గ్రామానికి చెందిన సంజప్ప, రమేష్... వీరనారాయణ ఆటోను అద్దెకు మాట్లాడుకుని పామిడి గ్రామానికి వెళ్లి ఐస్‌క్రీమ్‌లు కొనుగోలు చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. మార్గ మధ్యంలో కల్లుమడి వద్దకు చేరుకోగానే నియంత్రణ కోల్పోవడంతో ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తాపడింది. ఘటనలో వీరనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. సంజప్ప, రమేష్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

చేపల వలలో చిక్కిన మృతశిశువు



శింగనమల: చేపల కోసం వేసిన వలలో ఓ పసికందు మృతదేహం చిక్కింది. ఇంకా అవయవాలు పూర్తిగా ఏర్పడని ఓ పసికందు (మగ) మృతదేహాన్ని ప్లాస్టిక్ కవర్‌లో ఉంచి శింగనమల చెరువు చిన్న కాలువలో పడేశారు. మంగళవారం ఉదయం శింగనమలకు చెందిన మత్స్యకారులు కొందరు విసుర వలతో చిన్న కాలువలో చేపలు పడుతున్న సమయంలో అందులోకి చేపలతో పాటు ప్లాస్టిక్ కవరు చిక్కింది. ప్లాస్టిక్ కవర్‌ను విప్పి చూసిన మత్స్యకారులు ఒక్కసారిగా విస్తుపోయారు. 6– నెలల గర్భస్థ సమయంలోనే ప్రసవం జరిగి శిశువు మృతిచెందాడా? లేదా అబార్షన్ చేయించుకుని పోతూ శిశువు మృతదేహాన్ని కాలువలో పడిసి వెళ్లారా అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి.

కర్ణాటకలో ప్రమాదం... నేమకల్లు వాసుల మృతి




నాగరాజు, గణేష్ (ఫైల్)

బొమ్మనహాళ్: కర్ణాటకలో చోటు చేసుకున్న ప్రమాదంలో బొమ్మనహాళ్ మండలం నేమకల్లు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తులు తెలిపిన మేరకు.. నేమకల్లు గ్రామానికి చెందిన తిప్పేస్వామి, రత్నమ్మ దంపతుల కుమారుడు జి.నాగరాజు (19), వన్నూరు, వనజాక్షి దంపతుల కుమారుడు కె.గణేష్ (14) ఇద్దరూ మంచి స్నేహితు లు. తల్లిదండ్రులకు వ్యవసాయంలో చేదోడుగా ఉండేవారు. సోమవారం సాయంత్రం గ్రామానికి చెందిన కొందరితో కలసి నాగరాజు, గణేస్ పాదయాత్రగా కర్ణాటకలోని గూళ్యం గ్రామంలో గాదిలింగేశ్వర జాతరకు బయలుదేరారు. రాత్రి 9.30 గంటల సమయంలో కప్పగల్-సిరివర క్రాస్ వద్ద రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతుండగా వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన బొలెరో ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగరాజు, గణేష్‌ను గ్రామస్తులు వెంటనే బళ్లారిలోని విమ్స్‌కు అంబులెన్సులో తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే వారు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కర్ణాటక పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం అనంతరం స్నేహితుల మృతదేహాలను మంగళవారం నేమకల్లుకు కుటుంబసభ్యులు తీసుకువచ్చారు. విషయం తెలియగానే పెద్ద సంఖ్యలో స్థానికులు అక్కడకు చేరుకుని మృతదేహాలను పరిశీలించి కన్నీటిపర్యంతమయ్యారు. బాధిత కుటుంబసభ్యులను సర్పంచ్ పరమేశ్వర పరామర్శించి, అండగా ఉంటామని భరోసానిచ్చారు.

పీజీ తెలుగు పాఠ్యాంశంగా 'తడియారని స్వప్నం'



లోసారి సుధాకర్



అనంతపురం: ప్రముఖ కవి లోసారి సుధాకర్ రచించిన 'తడియారని స్వప్నం' కవితా సంపుటిని ఎస్కేయూ ఎంఏ తెలుగు కోర్సులో పాఠ్యాంశంగా చేర్చారు. 2025–26 విద్యా సంవత్సరం నుంచి 2027–28 విద్యా సంవత్సరం వరకూ ఈ పాఠ్యాంశం ఉంటుంది. ఈయన ప్రస్తుతం విజయవాడ ఏసీబీ అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్నారు. ఆయన రచించిన మొదటి కావ్యం 'మైనపు బొమ్మలు' సైతం ఎస్కేయూతో పాటు యోగివేమన వర్సిటీ, రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు పాఠ్యాంశంగా చేర్చిన విషయం తెలిసిందే. తడియారని స్వప్నం కవితా సంపుటిలో వస్తు వైవిధ్యం, సామాజిక స్పృహ, స్త్రీ దృక్కోణం, దళిత స్పృహ అంశాలను ప్రధానంగా ప్రస్తావించారు. కాగా, శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం కర్ణాటక నాగేపల్లికి చెందిన లోసారి సుధాకర్ ఎస్కేయూలో 1990–92 బ్యాచ్‌లో ఎంఏ పొలిటికల్ సైన్సెస్ పూర్తి చేశారు. పొలిటికల్ సైన్సెస్ చదివినప్పటికీ, తెలుగు సాహిత్యం, కవిత్వంపై మంచి పట్టు ఉంది. అనేక కవిత్వాలు, గ్రంథాలు రచించారు.

క్లుప్తంగా

హ్యాపీ స్ట్రీట్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్, అధికారులు, ఆర్డీటీ ప్రతినిధులు

అనంతపురం అర్బన్: ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న హ్యాపీ స్ట్రీట్ పోస్టర్‌ను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఈనెల 9న సాయంత్రం సప్తగిరి సర్కిల్‌లో ఆర్డీటీ చేపట్టిన హ్యాపీ స్ట్రీట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నగరపాలక కమిషనర్ బాలస్వామి, ఎస్ఈ చంద్రశేఖర్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, కో–ఆర్డినేటర్లు వంశీకృష్ణ, యుగంధర్, మహిళ బృందం అంజలి, దేవకి, రోష్లిమ్, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' సిబ్బందికి రూ.22 వేల జరిమానా



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ సలీమ్ బాషా

రాప్తాడు: ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలకు పాల్పడిన సిబ్బందికి రూ.22 వేలు జరిమానా విధించారు. అలాగే రూ.4.77,159ను సంబంధిత వ్యక్తుల నుంచి రికవరీ చేయాలని డ్వామా పీడీ సలీమ్ బాషా, అడిషనల్ పీడీ సుధాకర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 17వ విడత సామాజిక తనిఖీపై ప్రజావేదిక(బహిరంగ సభ) కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగింది. జనవరి 2023 నుంచి గతేడాది మార్చి ఆఖరు వరకూ మండల వ్యాప్తంగా 1626 పనులకు గాను రూ. 11 కోట్లు ఖర్చు చేశారు. వీటిపై తనిఖీ చేపట్టిన సామాజిక తనిఖీ బృందం పంచాయతీల వారిగా అక్రమాలను వెల్లడించింది. మొత్తం రూ.4,77,159 దుర్వినియోగమైనట్లు అధికారులు గుర్తించి రికవరీ చేయాలని ఆదేశించారు. అలాగే ఉపాధి సిబ్బందికి రూ.22 వేలు జరిమానా విధించారు. అంబుడ్స్‌మెన్ శివారెడ్డి, ఏపీడీ చెన్నకేశవులు, ఎంపీడీఓ విజయలక్ష్మీ, ఏపీఓ సావిత్రి ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గౌరవంగా జీవించడం మహిళల హక్కు



మాట్లాడుతున్న మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి దుర్గాభవాని

అనంతపురం అర్బన్: గౌరవప్రదంగా జీవించడం మహిళల హక్కని, దాన్ని సాధించుకునే దాకా పోరాడదామని ఏపీ మహిళ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి పి.దుర్గాభవాని పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి దుర్గాభవానితో పాటు న్యాయవాది పద్మజ, ప్రిన్సిపాల్ ప్రశాంతి హాజరై మాట్లాడారు. మహిళ మహిళా సాధికారత దిశగా సమానత్వం కోసం చేసే పోరాటాలను వేగవంతం చేద్దామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 8న అంతర్జాతీయ మహిళ దినోత్సవ వారోత్సవాలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. స్త్రీ భద్రత, లింగ సమానత్వం, మహిళ సాధికారతకు పాలకులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. మహిళల హక్కులను కాపాడేందుకు ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళ సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పార్వతిప్రసాద్, పద్మావతి, నగర అధ్యక్షురాలు జానకి, గౌరవాధ్యక్షురాలు కమ్మక్క, నేతలు లక్ష్మీ, మమత, లక్ష్మీదేవి, మాబీ, సునీత, సారంబీ, రాధిక, ప్రియా మాధురి పాల్గొన్నారు.

నాటుసారాతో అన్నీ అనర్థాలే



మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్ఐ శివప్రసాద్

చెన్నేకొత్తపల్లి: నాటుసారాతో అన్నీ సమస్యలే అని, దానికి దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ ఫరూక్ అజాం, ఎస్ఐ శివప్రసాద్ ప్రజలకు సూచించారు. మేడాపురం గ్రామంలో మంగళవారం నవోదయం కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించాలని ప్రజలకు సూచించారు. అనంతరం ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. సర్పంచ్ రామాంజినేయులు, ఆర్ఐ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎన్‌సీయూలో పీడియాట్రీషియన్ హాజరుపై ఆరా తీస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు



హెచ్ఓడీలతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఏడీ మల్లికార్జునరెడ్డి

మేమింతే.. మా తీరింతే!

- జీజీహెచ్‌లో తీరుమారని వైద్యులు
- సూపరింటెండెంట్ తనిఖీలో పత్తాలేని పీడియాట్రీషియన్
- పీడియాట్రిషియన్లు హరిణి, శంకర్‌నారాయణకు మెమో జారీ

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో కొందరు వైద్యుల తీరు మారడం లేదు. ఎవరేమన్నా..తమకు ప్రైవేట్ ప్రాక్టీసే మిన్న అన్న చందంగా వారు వ్యవహరిస్తుండడం చర్చనీయాంశమైంది. మంగళవారం సాక్షిలో 'పర్యవేక్షణ శూన్యం..డాక్టర్ల ఇష్టారాజ్యం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, ఏడీ హాస్పిటల్ మల్లికార్జున రెడ్డి తదితరులు ఆస్పత్రిలో వివిధ ఓపీ విభాగాలు, సూపర్ స్పెషాలిటీని తనిఖీ చేశారు. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో సూపరింటెండెంట్ ఎస్ఎన్‌సీయూను తనిఖీ చేశారు. ఆ సమయంలో డ్యూటీ వైద్యురాలు డాక్టర్ హరిణి అందుబాటులో లేరు. అక్కడున్న స్టాఫ్‌నర్సులను ఆరా తీయగా ఇంకా రాలేదని చెప్పడంతో సూపరింటెండెంట్ సంబంధిత హెచ్ఓడీ డాక్టర్ రవికుమార్‌ను ఆరా తీశారు.

వైద్యుల గైర్హాజరుపై అసహనం..

ఇప్పటికే పీడియాట్రీషియన్ డాక్టర్ హరిణి, డాక్టర్ శ్రీధర్‌కు విధులకు గైర్హాజరవుతున్నట్లు మెమో జారీ చేశామని, ఇంకా కొంతమంది అదే పద్ధతి కొనసాగిస్తున్నారని సూపరింటెండెంట్ అసహనం వ్యక్తం చేశారు. తన చాంబర్‌లో ఆయన ఏడీ మల్లికార్జున రెడ్డితో కలిసి హెచ్ఓడీల సమావేశం నిర్వహించారు. ఉన్నఫలంగా విధులకు డుమ్మాకొడితే మాత్రం ఉపేక్షించేది లేదని, వీలైతే వారు పని చేసే క్లినిక్‌లకు వెళ్లి ఫొటోలు తీసుకుని డీఎంఈకు ఫిర్యాదు చేస్తామన్నారు. వైద్యులు విధులకు గైర్హాజరైతే హెచ్ఓడీలకు మెమో జారీ చేస్తామని హెచ్చరించారు. ఆస్పత్రి ప్రవేశ మార్గంలో రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు సూపరింటెండెంట్, ఏడీ తెలియజేశారు. వైద్యులు ఏ సమయంలో వచ్చారు, ఎప్పుడు బయటకు వెళ్తున్నారో ఆరా తీస్తామన్నారు. ఆర్థోలో ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్, మెడిసిన్‌లో ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఎస్ఎన్‌సీయూలో పీడియాట్రీషియన్లు, సర్జరీ విభాగంలో కీలక వైద్యులు విధులకు గైర్హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేసి ఆస్పత్రికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈసందర్భంగా సూపరింటెండెంట్ పీడియాట్రీషియన్ డాక్టర్ హరిణితో పాటు ఎస్ఎన్‌సీయూ నోడల్ ఆఫీసర్ డాక్టర్ శంకర్ నారాయణకు మెమో జారీ చేశారు. మూడోసారి మోమో జారీ అయితే డీఎంఈకు నివేదికను పంపి, శాఖపరమైన చర్యలకు సిఫారసు చేస్తామని ప్రకటించారు.

ఓపీ కౌంటర్ల పెంపు

రోగులు సౌకర్యార్థం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో మంగళవారం మరో నాలుగు ఓపీ కౌంటర్లను సూపరింటెండెంట్ ప్రారంభించారు. గతంలో 8 కౌంటర్లుండేవని, రోగులకు ఇబ్బందులు కల్గకుండా కౌంటర్లను పెంచామన్నారు. అబా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పక్కాగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఓపీకి వచ్చే రోగులు, వారి సహాయకులు రోగి ఆధార్, తదితర ప్రతులను తీసుకురావాలన్నారు.

బాధ్యతగా పని చేసి మంచి పేరు తీసుకురండి



పదోన్నతి పత్రాలు అందుకున్న ఉద్యోగులతో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: బాధ్యతతో పని చేసి మంచి పేరు తీసుకురావాలని ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఉద్యోగులకు సూచించారు. పెనుకొండ పంచాయతీరాజ్ క్వాలిటీ సెల్ విభాగంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ గజ్జల శ్రీనివాసరెడ్డికి ఏఓగా పదోన్నతి కల్పించి నల్లమాడకు, పెద్దవడుగూరు ఎంపీడీఓ కార్యాలయంలో పని చేసే టి.ఫణిశేఖర్‌రెడ్డిని అగళి మండల పరిషత్ కార్యాలయానికి, అనంతపురంలోని జెడ్పీలో పని చేసే కె.నరసింగరావును సోమందేపల్లి మండల పరిషత్ కార్యాలయ ఏఓగా నియమించారు. ఈమేరకు మంగళవారం జెడ్పీచైర్‌పర్సన్ తన చాంబర్‌లో సీఈఓ రాజోలి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ జి.వెంకటసుబ్బయ్యతో కలసి పదోన్నతి, పోస్టింగ్ ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. పదోన్నతులు, కారుణ్య నియామకాల విషయంలోనూ తాము ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం ఏఓ షబ్బీర్‌నియాజ్, సీనియర్ అసిస్టెంట్ అరుణకుమారి, పీఎఫ్ విభాగం ఏఓ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ నేత జగదీష్

అనంతపురం రూరల్: ఎన్నికల్లో అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వారిని నిలువునా మోసం చేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జగదీష్ మండిపడ్డారు. అర్హులకు ఇంటి పట్టాలను మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ పట్టణాల్లో ఉండే వారికి 2 సెంట్లు, గ్రామాల్లో నివసించే వారికి 3 సెంట్లు స్థలం ఇచ్చిన ఇంటి నిర్మాణాలు చేపడుతామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారం చేపట్టి 9 నెలలు కావస్తున్న ఇచ్చిన హామీని అమలు చేయకుండా పేదల జీవితాల్లో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను అములు చేయకపోతే కూటమి ప్రభుత్వాన్ని మహిళలే ఇంటికి సాగనంపుతారన్నారు. ఇచ్చిన హామీలు అములు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రాబోయే రోజుల్లో సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి మల్లికార్జున, మండల కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పీజీ ఫలితాల్లో జీఎంసీకి ర్యాంకుల పంట



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు

అనంతపురం మెడికల్: వైద్య విద్యలో ఇటీవల నిర్వహించిన పోస్టు గ్రాడ్యుయేషన్(పీజీ) పరీక్షల్లో అనంతపురం వైద్య కళాశాలలో వివిధ విభాగాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో 8 ర్యాంకులను కైవసం చేసుకున్నారు. గైనిక్ విభాగంలో డాక్టర్ సుషోబిత 78 శాతం మార్కులతో మొదటి ర్యాంకు సాధించారు. అలాగే డాక్టర్ అమృత 77 శాతం మార్కులతో 3వ ర్యాంకు, డెర్మటాలజీలో డాక్టర్ శివానీ 78 శాతం మార్కులతో మొదటి ర్యాంకు, డాక్టర్ నిహారిక 77 శాతం మార్కులతో రెండవ ర్యాంకు, డాక్టర్ రమ్య 76 శాతం మార్కులతో 4వ ర్యాంకు, ఫార్మకాలజీలో డాక్టర్ సాగరిక 76 శాతం మార్కులతో 2వ ర్యాంకు, కమ్యూనిటీ మెడిసిన్‌లో డాక్టర హర్షిత 76 శాతం మార్కులతో 2వ ర్యాంకు, మైక్రోబయాలజీలో డాక్టర్ యల్లం నాయుడు 71 శాతం మార్కులతో మొదటి ర్యాంకు సాధించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను మంగళవారం జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ షంషాద్‌బేగం, డాక్టర్ మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు జీఎంసీ స్నాతకోత్సవం

సూపర్ స్పెషాలిటీ ఆవరణలో బుధవారం సాయంత్రం 7 గంటలకు 2కే19 బ్యాచ్‌కు చెందిన హౌస్ సర్జన్ల స్నాతకోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ హాజరు కానున్నారు.

సీనియారిటీ జాబితాలో పొరపాట్లను సరిచేయాలి



విద్యాశాఖ ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ సీనియారిటీ లిస్టుకు సంబంధించి అన్ని కేడర్లలో జరిగిన పొరపాట్లను సరి చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం విద్యాశాఖ ఏడీ కృష్ణయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. మునిసిపల్, కార్పొరేషన్ పరిధిలోకి జెడ్పీ, గవర్న్ మెంట్ మేనేజ్‌మెంట్ల నుంచి వచ్చిన టీచర్లకు సరైన డేటా లేనందున ఎక్కువ మంది ఉపాధ్యాయుల వివరాల నమోదులో పొరపాట్లు దొర్లాయని ఎస్టీయూ నాయకులు పేర్కొన్నారు. టీస్ సాఫ్ట్‌వేర్‌ను మార్చాలన్నారు. తప్పులను సరిదిద్ది ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారులు విడుదల చేసిన జాబితాలో చాలామంది సీనియార్టీ ప్రకారం లిస్టులో నమోదు కాలేదన్నారు. వారంతా ఆన్‌లైన్‌లో కరెక్ట్‌గా నమోదు చేసినప్పటికీ తప్పుగా రావడం గందరగోళానికి గురవుతున్నారని తెలిపారు. సీనియార్టీ కోసం ఇనిషియల్ డేట్ అఫ్ జాయినింగ్ కాకుండా నగరపాలక సంస్థ, మున్సిపాలిటీలో చేరిన తేదీని సీనియార్టీ ప్రాధాన్యంగా తీసుకోవాలన్నారు. సీనియారిటీ లిస్టులో పొరపాట్లు జరిగాయని వాటిని సరి చేసి అందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఏడీని కలిసిన వారిలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు నీలూరి రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. రామాంజనేయులు, నాయకులు జి. సూర్యుడు, ఫణి భూషణ్, అజయ్ కుమార్, జి.మల్లికార్జున, రామకృష్ణ, నరసింహులు, నారాయణ స్వామి తదితరులు ఉన్నారు.

నెలాఖరులోపు టార్గెట్ పూర్తి కావాలి

- మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ రామాంజినేయులు ఆదేశం



ఏడీఎంలు, సెక్రటరీలతో సమావేశమైన రామాంజినేయులు

అనంతపురం అగ్రికల్చర్: నెలాఖరులోపు నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) సి.రామాంజినేయులు ఆదేశించారు. జిల్లాకు వచ్చిన ఆయన మంగళవారం స్థానిక మార్కెటింగ్‌శాఖ కార్యాలయంలో రెండు జిల్లాల ఏడీఎంలు పి.సత్యనారాయణచౌదరి, ఎల్ఎన్ మూర్తితో కలసి మార్కెట్ కమిటీ ఆదాయ వనరులపై సెక్రటరీలు, సూపర్‌వైజర్లతో సమీక్షించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఫీజు వసూళ్లలో రెండు జిల్లాలు నిర్దేశించిన శాతానికన్నా ఎక్కువ ప్రగతి సాధించాలన్నారు. అనంతపురం జిల్లాలో ఈ ఏడాది రూ.12.06 కోట్లకు గానూ 82 శాతంతో రూ. 9.97 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాలో రూ.5.31 కోట్లకు గానూ 82 శాతంతో రూ.4.37 కోట్లు సాధించినట్లు తెలిపారు. రాప్తాడు, ఉరవకొండ, గుంతకల్లు, ధర్మవరం, హిందూపురం కమిటీలు వెనుకబడినందున ఆర్థిక సంవత్సరం ముగిసే ఈ 25 రోజుల్లో ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. పశువులు, జీవాలు, మిరప, చింతపండు, చీనీ మార్కెట్లలో లీకేజీలు అరికట్టాలని, రెన్యువల్స్, గోదాముల అద్దెలు పూర్తి స్థాయిలో వసూలు చేయాలని ఆదేశించారు. మార్కెట్ కమిటీల్లో ఇతర అభివృద్ధి కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే 2025–26కు సంబంధించి బడ్జెట్ ప్రతిపాదనలు తయారు చేసి పంపాలన్నారు. ఈ ఏడాది కన్నా వచ్చే ఏడాదికి టార్గెట్లు పెంచుకుని లక్ష్య సాధనకు గట్టిగా పనిచేయాలని సూచించారు.

విజృంభిస్తున్న అతిసారం



కూడేరు పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న అతిసార బాధితులు

కూడేరు: గ్రామాల్లో అతిసారం విజృంభిస్తోంది. మంగళవారం కలగళ్ల, చోళసముద్రం, కరుట్లపల్లి, ఉదిరిపికొండతో పాటు ఆత్మకూరు మండలం సింగంపల్లి, తలుపూరు గ్రామాలకు చెందిన ప్రజలు కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలతో బాధపడుతూ వైద్యం కోసం సుమారు 20 మంది దాకా కూడేరు పీహెచ్‌సీకి వచ్చారు. డాక్టర్ సౌమ్యారెడ్డి వారిని పరీక్షించి, అవసరమైన వారికి సెలైన్ ఎక్కించారు. ఆహారం తినే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలని, కలుషిత నీటిని, ఆహార పదార్థాలను తీసుకోవద్దని డాక్టర్ సూచించారు. ఎండలు మండుతున్నాయని, నీరు ఎక్కువగా తాగాలని తెలియజేశారు. నాలుగైదు రోజులుగా రోజుకు ఐదారుగురు అతిసారం బారినపడి వైద్యం కోసం పీహెచ్‌సీకి వస్తున్నారు.

జగనన్న కాలనీల్లో సామగ్రిని కాపాడాలి



ఆలమూరు జగనన్న కాలనీలో ఐరన్‌ను పరిశీలిస్తున్న రాంభూపాల్

రాప్తాడురూరల్: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అనంతపురం రూరల్ ఆలమూరు, కొడిమి జగనన్నకాలనీల నుంచి ఇసుక, కంకర, ఐరన్ యథేచ్ఛగా దొంగలిస్తున్నా అడిగే వారు లేరని, పేదల సొంతింటి కళ ఇలా దొంగల పరమవుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్ మండిపడ్డారు. కొడిమి, ఆలమూరు జగనన్న కాలనీల్లో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మన్నీల రామాంజనేయులు, రాప్తాడు కార్యదర్శి పోతలయ్య, స్థానిక నాయకులు నాగార్జునతో కలిసి రాంభూపాల్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఉన్న ఐరన్, ఇసుక, కంకరను కాపాడాలని డిమాండ్ చేశారు. అనంతపురం అర్బన్ లో సుమారు పది వేల మంది పేదలు జగనన్న ఇళ్లకు అర్హులుగా ఎంపికయ్యారన్నారు. వీరికి కొడిమి, ఆలమూరు పంచాయితీల్లో ఇళ్లు నిర్మించాలని ఏర్పాటు చేశారు. కొడిమి దగ్గర ఒక్క ఇల్లు పూర్తి కాలేదన్నారు. ఆలమూరు వద్ద 7,500 ఇళ్లు కట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో ఇళ్ల నిర్మాణం ఆగిపోయిందన్నారు. గతంలోనూ టీడీపీ ప్రభుత్వం జీఎస్టీయూ వద్ద టిడ్కో ఇళ్ల నిర్మాణం చేసిందని, పూర్తికాని ఇళ్లకు అప్పులు చెల్లించమని బ్యాంకు వారు నోటీసులు ఇస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మధ్యంతరంగా నిలచిపోయిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే లబ్ధిదారులతో కలిసి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

నిర్మలకుమారికి అభినందనలు



నిర్మలకుమారిని అభినందిస్తున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నారీరత్న జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎన్నికైన నిర్మలకుమారిని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అభినందించారు. మంగళవారం ఆమె అనంతను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుకెళ్తున్న శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 9న విజయవాడలో ఆమెకు వందనం పేరుతో అవార్డులను అందించనున్నారు. ఇందులో నగరానికి చెందిన నల్లి నిర్మలకుమారిని ఉమెన్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు(2025)కు ఎంపిక చేశారు.

ఆటో కార్మికులకు రూ.15 వేలు ఇవ్వాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

అనంతపురం అర్బన్: ఎన్నికల హామీ మేరకు ప్రతి ఆటో కార్మికుడికి ప్రభుత్వం రూ.15 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజారెడ్డి డిమాండ్ చేశారు. కార్మికులను ఇబ్బందికి గురిచేసే జీఓలు 21, 31ను రద్దు చేయాలన్నారు. ఆటో డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ఆటో కార్మికులకు రూ.15 వేలు ఇస్తామని సీఎం చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు దాటుతున్నా హామీ అమలు చేయడం లేదన్నారు. చలనాలను భారీగా పెంచి కార్మికులను ఇబ్బందికి గురిచేస్తున్నారని మండిపడ్డారు. ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆటో కార్మికుల అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 849 గెజిట్‌ను రద్దు చేయాలన్నారు. ఏఐటీయూజీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజు, ఉపప్రధాన కార్యదర్శి కృష్ణానాయక్, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

శింగనమల: మండలంలోని శింగనమల క్రాస్‌లో ద్విచక్రవాహనం డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి 8.30 గంటల సమయంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు పోతురాజుకాల్వ గ్రామానికి చెందిన బాలముని, చౌడయ్య ఉదయం ద్విచక్రవాహనంలో అనంతపురం వెళ్లారు. అక్కడ పని ముగించుకుని రాత్రి తిరిగి 544–డీ రోడ్డు మీదుగా పోతురాజుకాల్వకు బయలుదేరారు. శింగనమల క్రాస్ వద్దకు రాగానే డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డు మీద వెళుతున్న వారు గుర్తించి, వెంటనే వారిని 108లో చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మారుతీనగర్‌లో స్టోర్ వద్ద ప్రజల క్యూ



క్యూలో నిల్చునే ఓపిక లేక కూర్చున్న మహిళలు

అష్టకష్టాల రేషన్ ...

కూటమి ప్రభుత్వంలో రేషన్ లబ్ధిదారులు అష్టకష్టాలు పడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే ఎండీయూ వాహనం ద్వారా రేషన్ అందించే పరిస్థితి ఉండేది. కూటమి ప్రభుత్వ ఏర్పాటయ్యాక వాటిని తొలగించారు. దీంతో ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. బియ్యం కోసం బ్యాగులు క్యూలో ఉంచుతున్నారు. పనులు మానుకుని రేషన్ దుకాణాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. అవస్థలు పడుతూ సంచులు మోసుకెళ్తున్నారు. అనంతపురం శ్రీనివాస్ నగర్‌లో స్టోర్‌ను నాలుగు రోజుల నుంచి తీయకపోవడంతో కష్టాలు చెప్పనలవిగా మారాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే బాగుండేదని, ఇప్పుడు ఇవేం ఇబ్బందులు అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



శ్రీనివాస్ నగర్‌లోని స్టోర్ వద్ద సంచులు ఉంచిన దృశ్యం